ఏడాదిపాటు వాడకపోతే యూపీఐ ఐడీ క్లోజ్

బ్యాంక్‌లు, యాప్‌లకు ఎన్‌పీసీఐ ఆదేశం

ముంబై, నవంబర్ 17: వాడకంలో లేని యూపీఐ ఐడీలు, నంబర్లను డీయాక్టివ్ చేయాలంటూ గూగుల్ పే, పేటీఎం, ఫోన్‌పే తదితర పేమెంట్ యాప్స్, బ్యాంక్‌లను నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ) ఆదేశించింది. ఒక ఏడాదికంటే మించి యాక్టివ్‌గా లేని ఐడీలను, నంబర్లను క్లోజ్ చేయాలంటూ యూపీఐ సభ్య సంస్థలన్నింటికీ ఎన్‌పీసీఐ ఈ మేరకు సర్క్యులర్ జారీచేసింది. 2023 డిసెంబర్ 31 నాటికల్లా ఈ మార్గదర్శకాల్ని అమలు చేయాలంటూ థర్డ్‌పార్టీ యాప్ ప్రొవైడర్లు (టీపీఏపీ), పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్ (పీఎస్‌పీ) బ్యాంకుల్ని కోరింది. ఖాతాదారులు మొబైల్ ఫోన్ నంబర్లను మార్చుకున్నపుడు వారి ఖాతాల నుంచి వారికి సంబంధం లేని ఖాతాలకు డబ్బు బదిలీ అయ్యే ప్రమాదం ఉన్నందున ఎన్‌పీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నది. పలువురు కస్టమర్లు కొత్త మొబైల్ నంబర్‌ను తీసుకున్నప్పటికీ, పాత నంబరును బ్యాంకింగ్ సిస్టమ్ నుంచి తొలగించకపోవడం, పాత నంబరును మరొకరికి టెలికం ఆపరేటరు జారీ చేయడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతుందని ఎన్‌పీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఒక ఏడాదికాలంగా ఎటువంటి ఆర్థిక లావాదేవీలు జరగని యూపీఐ యాప్‌లు, యూపీఐ ఐడీలు, యూపీఐ నంబర్లను ప్రొవైడర్లు గుర్తించి, ఆ కస్టమర్ ఐడీలను, నంబర్లను డీయాక్టివేట్ చేయాలని ఎన్‌పీసీఐ సర్క్యులర్‌లో పేర్కొంది. యూపీఐ మ్యాపర్ నుంచి అటువంటి ఖాతా కలిగిన ఫోన్ నంబర్‌ను సైతం డీరిజిస్టర్ చేయాలని ఆదేశించింది.

మళ్లీ ఫారెక్స్ డౌన్

వారం రోజుల్లో 462 మిలియన్ డాలర్లు క్షీణత

ముంబై, నవంబర్ 17: దేశీయ ఫారెక్స్ నిల్వలు మళ్లీ క్షీణించాయి. ఈ నెల 10తో ముగిసిన వారంలో రూ.462 మిలియన్ డాలర్లు పడిపోయి 590.321 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) శుక్రవారం తెలియజేసింది. అంతకుముందు రెండు వారాల్లో 7.251 బిలియన్ డాలర్లు పెరిగిన విషయం తెలిసిందే. అయితే అంతకు ముందు వారాల్లో మాత్రం వరుసగా ఫారెక్స్ నిల్వలు ఆందోళనకరంగా పతనం కావడం గమనార్హం. ఏకంగా 15-20 బిలియన్ డాలర్ల మేర హరించుకుపోయాయి. 2021 అక్టోబర్‌లో భారతీయ ఫారెక్స్ రిజర్వులు మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో 645 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అయితే మళ్లీ ఎప్పుడూ ఆ స్థాయికి దేశంలో విదేశీ మారకం నిల్వలు చేరకపోవడం గమనించదగ్గ అంశం. ఇదిలావుంటే ప్రస్తుతం భారత్ వద్ద ఫారిన్ కరెన్సీ అసెట్స్ 522.004 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దేశీయ ఫారెక్స్ నిల్వల్లో ఇవే అత్యధికం. ఇక బంగారం నిల్వల విలువ 45.515 బిలియన్ డాలర్లుగా ఉన్నది.

తెలంగాణ 3.0 లోడింగ్

డెవలప్‌మెంట్ ఐకాన్‌గా ఇంకో వెర్షన్ రెడీ

5 రంగాల్లో అనూహ్య అభివృద్ధికి ప్రణాళిక

హైదరాబాద్‌ను థియేటర్ డిస్ట్రిక్ట్ మార్చేస్తాం

వచ్చే టర్మ్‌లో టూరిజం రంగానికి పెద్దపీట

సీఎంను ఒప్పించి పర్యాటక మంత్రినవుతా

సేవ రంగానికి గొప్ప ప్రోత్సాహకాలిస్తాం

ఆరున్నరేండ్లలోనే 5 విప్లవాలు సాధించాం

బీఎన్ఐ సదస్సులో మంత్రి కేటీఆర్ వెల్లడి

హైదరాబాద్‌లో బీఎన్ఐ ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): తొమ్మిదన్నరేండ్ల పాలనలో రాష్ర్టాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, మరెంతో అభివృద్ధి చేయాల్సి ఉన్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు అన్నారు. సాఫ్ట్‌వేర్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చెందుతున్నట్టే తమ అభివృద్ధి వెర్షన్ కూడా అప్‌డేట్‌తో సిద్ధంగా ఉన్నదని చెప్పారు. 'తెలంగాణ 3.0 వెర్షన్' డెవలప్‌మెంట్‌కు ఐకాన్‌గా నిలుస్తుందని తెలిపారు. శుక్రవారం బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మూడో సారి అధికారంలోకి వచ్చాక ఐదు రంగాల్లో అనూహ్యమైన ప్రగతిని సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, వాటిలో పర్యాటకం, క్రీడల మౌలిక సదుపాయాలు, విద్య-నైపుణ్యం, ఆరోగ్యం, ఐటీ-ఆంత్రప్రెన్యూర్‌షిప్ విభాగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు వివరించారు. రాష్ట్రంలో సకల జనుల సంక్షేమాన్ని కొనసాగిస్తూ, చేయాల్సిన మంచి పనులపై సమగ్ర ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎన్నో రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచామని, ఈ అభివృద్ధి దేశ, విదేశాల్లో ఉన్న ప్రముఖ సెలబ్రిటీలకు అర్థమవుతుంటే, స్థానిక ప్రతిపక్ష నేతలకు మాత్రం అర్థం కావడం లేదని విమర్శించారు.

పర్యాటక రంగానికి చేయూత

రాష్ట్రమంతా సామాజిక మౌలిక సదుపాయాలపై దృష్టి సారించామని కేటీఆర్ చెప్పారు. ముఖ్యంగా పర్యాటక శాఖకు పెద్ద పీట వేయాలనుకుంటున్నామని అన్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్ అవకాశం ఇస్తే, ఆయనను బతిమాలైనా వచ్చే ఐదేండ్లు పర్యాటక శాఖ మంత్రిగా ఉంటానని తెలిపారు. ఈ రంగంలోని అవకాశాలను మరింత విస్తృతం చేస్తానని వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా కొత్త రిజర్వాయర్లు కనిస్తున్నాయని, వాటి పరిసరాల్లో చాలా ఉపాధి అవకాశాలున్నాయని అన్నారు. తెలంగాణలో మెడికల్ టూరిజం, ఆధ్యాత్మిక టూరిజం, హెల్త్ టూరిజం, అడ్వెంచర్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం వంటివాటిల్లో ఎన్నో అవకాలు ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ నిధులు అవసరం లేకుండానే పీపీపీ పద్ధతిలో మరింత అభివృద్ధి చేసుకోవచ్చని వెల్లడించారు. రాష్ట్రంలోని ఆంత్రప్రెన్యూర్స్ ఈ రంగంపై దృష్టిసారించాలని కోరారు. ప్రస్తుత రాష్ట్ర అభివృద్ధి ట్రైలర్ మాత్రమేనని, మున్ముందు అభివృద్ధి రుచి మరింత చూపిస్తామని తెలిపారు. హైదరాబాద్‌ను థియేటర్ డిస్ట్రిక్ట్‌గా చేస్తామని, ఇలాంటి ప్రణాళికలను అర్బన్ ప్రాంతాల్లో కూడా అమలు చేస్తామని వివరించారు.

ఆంత్రప్రెన్యూర్‌షిప్‌కు అడ్డాగా తెలంగాణ

పారిశ్రామిక రంగంలో దూసుకెళ్లేందుకు తెలంగాణ సిద్ధంగా ఉన్నదని, కొత్తగా వచ్చే ఆంత్రప్రెన్యూర్స్‌కు తెలంగాణ అడ్డాగా మారనున్నదని కేటీఆర్ చెప్పారు. టీహబ్, వీహబ్, టీవర్క్స్, టాస్క్, టీఎస్ఐసీ, రిచ్ వంటి వ్యవస్థల ద్వారా ఎంతోమందిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దామని, నేటికీ వారికి ఫండింగ్, లోన్స్ ఇస్తున్నామని వెల్లడించారు. వీహబ్ ద్వారా ఎంతోమంది మహిళలు వ్యాపారవేత్తలుగా రాణిస్తున్నారని వివరించారు. దళిత వ్యాపారవేత్తల కోసం డిక్కీ ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. టీహబ్‌కు చెందిన ఓ కంపెనీ భారత్ నుంచి ప్రైవేట్‌గా అంతరిక్షంలోకి రాకెట్ పంపి చరిత్ర సృష్టించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో మహావీర్ సౌండ్‌రూమ్ ఫౌండర్ జలీల్ సబీర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనాషా, బీఎన్ఐ సభ్యులు పాల్గొన్నారు.

ఐదు విప్లవాలు

కరోనా మినహా తమకు దొరికిన ఆరున్నరేండ్లలో 5 విప్లవాలను సాధించామని మంత్రి కేటీఆర్ చెప్పారు. మూడున్నర కోట్ల టన్నుల ధాన్యం పండించి హరిత విప్లవం సాధించామ ని చెప్పారు. ఫిషరీస్‌కు తెలంగాణ అడ్డాగా మారిందని, 46 వేల చెరువులు, నీటి వసతులు ద్వారా టన్నుల కొద్దీ చేపలను ఎగుమతి చేసేస్థాయికి తెలంగాణ ఎదిగిందని, తద్వారా నీలి విప్లవం సాధించామని వెల్లడించారు. మాంసం ఉత్పత్తిలో దేశంలోనే ఉత్తమ స్థానంలో ఉన్నామని, తద్వారా గులాబీ విప్లవం సాధ్యమైందని వివరించారు. రైతులకు ఇస్తున్న ప్రోత్సాహకాల ద్వారా శ్వేత విప్లవం సాధ్యమైందని తెలిపారు. రాష్ట్రం ఆయిల్‌పామ్‌కు అడ్డాగా మారనున్నది, తెలంగాణలో 20 లక్షల ఎకరాల్లో పామాయిల్ పండిస్తున్నామని తద్వారా పసుపు విప్లవం సాధ్యమైందని వెల్లడించారు. ఈ ఐదు విప్లవాలను ఆధారం చేసుకొని ఎన్నో స్టార్టప్‌లు వచ్చాయని, వాటి ద్వారా ఎందరికో ఉపాధి దొరికిందని పేర్కొన్నారు.

కార్వీ మాజీల బ్యాంక్ ఖాతాలు జప్తు

- **డీమ్యాట్ అకౌంట్లూ అటాచ్**
- **ఆదేశించిన సెబీ**

న్యూఢిల్లీ, నవంబర్ 17: కార్వీ గ్రూప్ మాజీ అధికారుల బ్యాంక్, డీమ్యాట్ ఖాతాల జప్తునకు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ ఆదేశించింది. కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (కేఎస్‌బీఎల్) కుంభకోణంలో దుర్వినియోగమైన క్లయింట్ల సొమ్ము రికవరీలో భాగంగా సుమారు రూ.1.8 కోట్ల (వడ్డీ, అన్నిరకాల వ్యయాలు, చార్జీలు, ఇతర ఖర్చులు కలిపి) కోసం ముగ్గురు మాజీ ఉన్నతోద్యోగుల ఖాతాల జప్తునకు సెబీ ఈ ఆదేశాలు జారీ చేసింది. కేఎస్‌బీఎల్ ఫైనాన్స్, అకౌంట్స్ విభాగం మాజీ ఉపాధ్యక్షుడు కృష్ణహరి జీ, బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్ మాజీ జనరల్ మేనేజర్ శ్రీనివాస రాజు, మాజీ కాంప్లియెన్స్ అధికారి శ్రీకృష్ణ గురజాడలకు చెందిన బ్యాంక్, డీమ్యాట్ ఖాతాల అటాచ్‌మెంట్‌కు సెబీ నిర్ణయం తీసుకున్నది. ఇందులోభాగంగానే వీరికి చెందిన ఖాతాల నుంచి ఏ రకమైన డెబిట్స్‌కు అనుమతులివ్వరాదని అన్ని బ్యాంకులు, డిపాజిటరీలు, మ్యూచువల్ ఫండ్స్‌కు సెబీ స్పష్టం చేసింది. ఈ మేరకు మంగళవారమే నోటీసులు వెళ్లాయి. అయితే ఆయా ఖాతాల్లో ఎవరైనా జమచేస్తే మాత్రం అంగీకరించాలన్నది. ఇక లాకర్లు సహా వీరికి చెందిన అన్ని ఖాతాలను అటాచ్ చేయాలని కూడా బ్యాంకులన్నిటికీ సెబీ సూచించింది. గత నెల ఈ ముగ్గురికి దాదాపు రూ.1.8 కోట్ల కోసం సెబీ డిమాండ్ నోటీసులు పంపిన విషయం తెలిసిందే. ఈ ఏడాది మే నెలలో కృష్ణహరిపై కోటి రూపాయలు, రాజుపై రూ.40 లక్షలు, శ్రీకృష్ణపై రూ.30 లక్షలు చొప్పున సెబీ ఫైన్ వేసిన సంగతి విదితమే.

జుట్టు మార్పిడికి యమా క్రేజ్

న్యూఢిల్లీ, నవంబర్ 17: దేశంలో జుట్టు మార్పిడి మార్కెట్ శరవేగంగా దూసుకుపోతున్నది. గడిచిన ఏడాది 180 మిలియన్ డాలర్లుగా ఉన్న ఈ మార్కెట్ 2032 నాటికి మూడింతలు పెరిగి 560 మిలియన్ డాలర్లకు చేరుకుంటుందని వరల్డ్ ఫాలిక్యూలర్ యూనిట్ ఎక్స్‌ట్రాక్షన్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ప్రదీప్ సేథీ తెలిపారు. ఇటీవలకాలంలో జుట్టు మార్పిడికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని, మరీ ముఖ్యంగా సెలబ్రిటీలు అత్యధికంగా వాడుతుండటం కూడా ఇందుకు కారణమన్నారు. గురుగ్రామ్‌లో యూజెనిక్స్ హెయిర్ సైన్సెస్‌ను ఆయన నిర్వహిస్తున్నారు. ఈ యూనిట్‌కు వచ్చే కస్టమర్లలో 40 శాతం మంది అమెరికా లేదా యూరప్ నుంచి వస్తుండటం విశేషమన్నారు. 2023 నుంచి 2032 మధ్యకాలంలో జుట్టు మార్పిడి మార్కెట్ సరాసరి 12 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటున్నదన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఆస్ట్రేలియా, యూఎస్, ఆఫ్రికా, యూరప్ దేశాల నుంచి క్లయింట్లు వస్తున్నట్టు చెప్పారు.

గోల్డ్ రష్

తులం బంగారం ధర రూ.61,750

హైదరాబాద్‌లో ఒక్కరోజే రూ.650 పైకి

రూ.1,500 పెరిగి రూ.79,500లకు కిలో వెండి

మున్ముందు మరింత పెరుగవచ్చన్న అంచనాలు

న్యూఢిల్లీ, నవంబర్ 17: బంగారం ధరలు మళ్లీ విజృంభిస్తున్నాయి. వరుసగా పెరుగుతున్న రేట్లతో పసిడి విలువ రూ.62,000లను సమీపిస్తున్నది. శుక్రవారం ఒక్కరోజే హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.650 ఎగబాకింది. దీంతో రూ.61,690గా నమోదైంది. ఆభరణాల బంగారంగా భావించే 22 క్యారెట్ పసిడి రేటు సైతం రూ.600 ఎగిసి రూ.56,550 పలికింది. మొత్తంగా చూసినట్టైతే మూడు రోజుల్లో 24 క్యారెట్ బంగారం రేటు రూ.1,200 పుంజుకోగా, 22 క్యారెట్ రూ.1,100 అందిపుచ్చుకున్నది. ఇక ఢిల్లీ మార్కెట్‌లో 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాములు రూ.540 పెరిగి రూ.61,750గా ఉన్నది.

వెండి ధరలు పరుగో.. పరుగు

బంగారం ధరలతో పోటీపడుతూ వెండి ధరలు కూడా పరుగులు పెడుతున్నాయి. కిలో వెండి ధర హైదరాబాద్‌లో శుక్రవారం ఒక్కరోజే రూ.1,500 పెరుగడం గమనార్హం. దీంతో రూ.79,500లను తాకింది. గత నాలుగు రోజుల్లో రూ.4,100 ఎగబాకడం విశేషం. బుధవారమైతే ఏకంగా రూ.1,700 పుంజుకున్నది. ఢిల్లీ మార్కెట్‌లోనూ రూ.1,200 ఎగిసి రూ.76,500 వద్ద నిలిచింది. అటు ఇన్వెస్టర్లు, ఇటు ఇండస్ట్రీ వర్గాల నుంచి పెరుగుతున్న డిమాండే ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని ట్రేడర్లు ప్రస్తుత మార్కెట్ సరళిని విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలోనే బంగారం, వెండి ధరలు రాబోయే రోజుల్లోనూ పెరిగేందుకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు.

గ్లోబల్ మార్కెట్‌లో..

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం ధరలు దౌడు తీస్తున్నాయి. శుక్రవారం ఔన్సు గోల్డ్ 1,984 డాలర్లు పలికింది. వెండి 23.86 డాలర్లుగా నమోదైంది. గురువారం ముగింపుతో పోల్చితే గోల్డ్ 17 డాలర్లు పెరిగింది. సిల్వర్ మాత్రం స్వల్ప వృద్ధినే కనబర్చింది. గ్లోబల్ స్టాక్ మార్కెట్లలో క్షీణత కొనసాగితే.. మదుపరులు తమ పెట్టుబడులను సురక్షిత సాధనంగా భావించే బంగారం వైపే మళ్లిస్తారని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

స్థిరంగా ఉంటేనే గిరాకీ

బంగారం కావచ్చు.. వెండి కావచ్చు.. ఏదైనాసరే వాటి ధరలు స్థిరంగా ఉంటేనే గిరాకీ బాగుంటుందని వ్యాపారులు చెప్పన్నారు. ధరలు తగ్గుముఖం పడితే ఇంకొద్ది రోజులు ఆగితే మరింత దిగొస్తాయన్న ఆశ కొనుగోలుదారుల్లో ఉంటుందని, అదే పెరుగుతూపోతుంటే తగ్గినప్పుడు కొందాంలే అన్న ధోరణి కనిపిస్తుందని వర్తకులు వివరిస్తున్నారు. మొత్తంగా ధరల్లో స్థిరీకరణ లోపిస్తే మార్కెట్‌లో వేచిచూసే వైఖరే ఉంటుందని అంటున్నారు. ధరలు నిలకడగా ఉంటే మాత్రం కస్టమర్లు కొనేందుకు ఆసక్తి చూపిస్తారని పేర్కొంటున్నారు.

ఫార్మా ఇండస్ట్రీలో హుషారు

- **2030 నాటికి 200 బిలియన్ డాలర్లకు భారతీయ ఔషధ పరిశ్రమ**
- **ఫార్మా కార్యదర్శి అరునిష్ చావ్లా**



న్యూఢిల్లీ, నవంబర్ 17: దేశీయ ఔషధ రంగ పరిశ్రమకు 2030 నాటికి 4-5 రెట్లు వృద్ధి చెంది దాదాపు 200 బిలియన్ డాలర్లకు చేరే సామర్థ్యం ఉందని ఫార్మాస్యూటికల్స్ శాఖ కార్యదర్శి అరునిష్ చావ్లా అన్నారు. శుక్రవారం ఇక్కడ జరిగిన వ్యాపార, పారిశ్రామిక సంఘం సీఐఐ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. భారతీయ ఫార్మా ఇండస్ట్రీ పెంచుకుంటున్న ఉత్పాదకత, ఎగుమతుల విలువ మరో ఏడేండ్లలో రూ.16.65 లక్షల కోట్ల (200 బిలియన్ డాలర్లు)కు చేరవచ్చన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇది దాదాపు 50 బిలియన్ డాలర్లుగానే ఉందన్న ఆయన.. ఏడేండ్లలో మరో 150 బిలియన్ డాలర్లు పెరుగవచ్చని అంచనా వేశారు.

రెండంకెల వృద్ధి అవసరం

భారతీయ ఫార్మా ఇండస్ట్రీకి రెండంకెల వృద్ధి అవసరమని ఈ సందర్భంగా చావ్లా అన్నారు. ఈ క్రమంలోనే విదేశాల నుంచి దిగుమతుల్ని తగ్గించుకుంటూ.. ఆయా దేశాలకు ఎగుమతుల్ని పెంచుకుంటూపోతే ఏటేటా ఆకర్షణీయ వృద్ధిని అందుకోవచ్చని పరిశ్రమకు సూచించారు. కాగా, ప్రస్తుతం ప్రపంచ ఔషధ రంగంలో భారతీయ సంస్థలకు, వాటి పరిశోధనలకు ప్రధాన గుర్తింపే ఉన్నది. కరోనా వేళ వ్యాక్సిన్ల తయారీలో దేశీయ సంస్థల పాత్రే మిటో విదితమే. ముఖ్యంగా హైదరాబాదీ సంస్థల కృషి అనిర్వచనీయం. ఇక దేశీయ ఫార్మా ఇండస్ట్రీ హబ్‌గా రాష్ట్ర రాజధాని నగరం విరాజిల్లుతున్నది తెలిసిందే.

స్మార్ట్ థెరపీలదే హవా

వచ్చే 20-30 ఏండ్లలో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోనున్నాయని ఈ సందర్భంగా చావ్లా పేర్కొన్నారు. స్మార్ట్ థెరపీలకు విశేష ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. కాగా, ప్రస్తుత విధానాలను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. అప్పుడే దిగుమతిదారుల నుంచి ఎగుమతిదారులుగా భారతీయ కంపెనీలు ఎదుగుతాయన్న విశ్వాసాన్ని కనబర్చారు. ప్రభుత్వాలు, కంపెనీల యాజమాన్యాలు కలిసి ముందుకెళ్తే అనుకున్న లక్ష్యాన్ని త్వరగా చేరుకోవచ్చన్నారు.

కార్ల సంస్థలకు పండుగ కిక్కు

- **గత మూడు నెలల్లో 11 లక్షల యూనిట్ల విక్రయాలు**

న్యూఢిల్లీ, నవంబర్ 17: కార్ల సంస్థలకు ఈ పండుగ సీజన్ కలిసొచ్చింది. ఈ సీజన్‌లో ప్యాసింజర్ వాహన విక్రయాలు తొలిసారిగా పది లక్షల మార్క్‌ను అధిగమించాయి. సెమికండక్టర్ల కొరత తీరడంతో ఆటోమొబైల్ సంస్థలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచుకోవడం ఇందుకు కారణమని ఆటోమొబైల్ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత పండుగ సీజన్(ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్) నెలల్లో అత్యధికంగా 11.38 లక్షల ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యాయి. ఒక పండుగ సీజన్‌లో ఇంతటి స్థాయిలో అమ్ముడవడం ఇదే తొలిసారి. ఆగస్టు 17న(ఓనం) ప్రారంభమైన పండుగ సీజన్ నవంబర్ 15(భాయ్ దూజ్)న ముగిసింది. ఏడాది క్రితం ఇదే సీజన్‌లో అమ్ముడైన 8.10 లక్షల యూనిట్ల కార్లు, యుటిలిటీ, సెడాన్ వాహనాలతో పోలిస్తే 41 శాతం ఎగబాకాయి.

టాప్‌లో మారుతి సుజుకీ

దేశీయంగా అమ్ముడవుతున్న ప్యాసింజర్ వాహనాల్లో మారుతి సుజుకీకి చెందినవే అధికంగా ఉన్నాయి. 2020, 2022, 2023ల్లో సంస్థ వరుసగా 4.71 లక్షలు(ఏడాది ప్రాతిపదికన 36 శాతం వృద్ధి), 3.40 లక్షల యూనిట్లు(2.2 శాతం వృద్ధి), 4.90 లక్షల యూనిట్లు(44 శాతం వృద్ధి) నమోదయ్యాయి.

- గత 47 రోజుల్లో ప్యాసింజర్ వాహన విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 14.5 శాతం పెరిగాయి.
- 2020లో 92 రోజుల పాటు కొనసాగిన పండుగ సీజన్‌లో 9.40 లక్షల యూనిట్ల అమ్మకాలు జరిగాయి.
- 2023లో ఎస్‌యూవీల అమ్మకాలు 20 లక్షల మార్క్‌ను అధిగమించే అవకాశాలున్నాయి.
- ఈ ఏడాది ధంతేరస్ రోజు హ్యుందాయ్ మోటర్ 10,293 యూనిట్ల వాహనాలను ఒకేరోజు డెలివరీ చేసింది.

పండుగ సీజన్‌లో తొలిసారిగా పది లక్షల వాహన విక్రయాల మార్క్ దాటింది. గతంలో 2020లో 9.34 లక్షల యూనిట్ల రికార్డు మరుగునపడిపోయింది. చిప్‌ల కొరత తీరడంతో మోడళ్ల కోసం వేచివుండే సమయం తగ్గనున్నది.

- శశాంక్ శ్రీవాత్సవ, మారుతి సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి

పడేసిన ఆర్థిక రంగ షేర్లు

భారీగా నష్టపోయిన సూచీలు

ముంబై, నవంబర్ 17: స్టాక్ మార్కెట్ల వరుస లాభాలకు బ్రేక్‌పడింది. వ్యక్తిగత రుణాలపై కఠిన ఆంక్షలు విధించాలని రిజర్వు బ్యాంక్ ఆదేశాలతో బ్యాంకింగ్, ఆర్థిక, ఎనర్జీ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల పవనాలు వీసినప్పటికీ ఆర్బీఐ ఆదేశాలు మార్కెట్లను నష్టాలవైపు నడిపించాయి. నష్టాలతో ప్రారంభమైన సూచీలు చివరివరకు ఇదే ట్రెండ్‌ను కొనసాగించాయి. క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను కుమ్మరించినప్పటికీ భారీ నష్టాలను పరిమితం చేయగలిగాయి. ఒక దశలో 350 పాయింట్ల స్థాయిలో నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 187.75 పాయింట్లు తగ్గి 65,794.73 వద్ద నిలిచింది. అటు ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 33.40 పాయింట్లు కోల్పోయి 19,713.80 పాయింట్ల వద్ద ముగిసింది.

ఆర్బీఐ దెబ్బకు ఫైనాన్స్ షేర్లు విలవిల

రిజర్వు బ్యాంక్ దెబ్బకు ఆర్థిక రంగ షేర్లు విలవిలలాడాయి. అన్‌సెక్యూర్డ్ వ్యక్తిగత రుణాలు మొండి బకాయిలుగా మారుతున్నాయని సెంట్రల్ బ్యాంక్ హెచ్చరించడంతో ఈ రుణాలపై కఠిన నిబంధనలను అమలు చేయాలని బ్యాంకులకు సూచించడంతో బ్యాంకింగ్, ఎన్‌బీఎఫ్‌సీ రంగ షేర్లు కుప్పకూలాయి. దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ షేరు ఏకంగా 3.64 శాతం తగ్గి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు యాక్సిస్ బ్యాంక్ 3.03 శాతం, కెనరా బ్యాంక్ 2.02 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.45 శాతం, ఫెడరల్ బ్యాంక్ 1.40 శాతం చొప్పున తగ్గాయి. వీటితోపాటు బీవోబీ, కొటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌ల షేర్లు కూడా దిగువకు పడిపోయాయి. బీఎస్ఈ బ్యాంకెక్స్ ఇండెక్స్ 1.48 శాతం తగ్గి 49,170.81కి జారుకున్నది. అలాగే ఆర్బీఎల్ బ్యాంక్ షేరు ఏకంగా 7.82 శాతం కోల్పోయింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ 2.11 శాతం, ఎస్బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ 5.19 శాతం, ఉజ్జీవన్ ఫైనాన్షియల్ సర్వీసులు 5 శాతం, అర్మాన్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 3.17 శాతం, ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ 3.08 శాతం, బజాజ్ ఫైనాన్స్ 1.99 శాతం తగ్గాయి. ఆర్బీఐ నిర్ణయం కొంతమేర ప్రభావం చూపుతున్నదని, యూరోజోన్ ద్రవ్యోల్బణ గణాంకాల కోసం పెట్టుబడిదారులు వేచిచూస్తున్నారని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

ఎల్ అండ్ టీ టాప్ గెయినర్..

దేశీయ మౌలిక రంగ సంస్థ లార్సెన్ అండ్ టుబ్రో టాప్ గెయినర్‌గా నిలిచింది. హిందుస్థాన్ యునిలీవర్, పవర్ గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, నెస్లె, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే బ్యాంకింగ్ రంగ సూచీ 1.48 శాతం తగ్గగా, ఆయిల్ అండ్ గ్యాస్ 1.35 శాతం, ఆర్థిక సేవలు, ఐటీ రంగ సూచీలు కూడా దిగువకు పడిపోయాయి. కానీ, ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్, క్యాపిటల్ గూడ్స్, రియల్టీ సూచీలు లాభాల్లో ముగిశాయి. మొత్తంమీద ఈ వారంలో సెన్సెక్స్ 890 పాయింట్లు లేదా 1.37 శాతం, నిఫ్టీ 306.45 పాయింట్లు 1.57 శాతం పెరిగాయి.

శుక్రవారం హైదరాబాద్ నుంచి మొదలైన కొత్త సర్వీసుతో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సిబ్బంది, శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు

హైదరాబాద్-లక్నో ఎయిర్ ఇండియా విమాన సర్వీసు

అమృత్‌సర్, గ్వాలియర్, కొచ్చీకి కూడా ఫ్లైట్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నుంచి దేశంలోని ఆయా కొత్త నగరాలకు విమాన సర్వీసులను ఎయిర్ ఇండియా అందుబాటులోకి తెచ్చింది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లక్నో, అమృత్‌సర్, కొచ్చీలకు శుక్రవారం ఫ్లైట్లు మొదలయ్యాయి. అలాగే గ్వాలియర్‌కు ఈ నెల 28 నుంచి విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా జీఎమ్మార్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఈ కొత్త రూట్లకు విమాన సేవల్ని తీసుకురాగలిగింది. కాగా, హైదరాబాద్ నుంచి అమృత్‌సర్‌కు వెళ్లే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం రోజూ ఉదయం 7:30 గంటలకు బయలుదేరి 10:15 గంటలకు చేరుకుంటుంది. లక్నోకు మధ్యాహ్నం 2:30 గంటలకు మొదలై సాయంత్రం 4:35 గంటలకు చేరుతుంది. అయితే హైదరాబాద్-లక్నో మధ్య వారానికి ఆరు సర్వీసులే ఉంటాయి. ఇక కొచ్చీకి రోజూ రాత్రి 7:45 గంటలకు బయలుదేరి 9:30 గంటలకు గమ్యస్థానానికి చేరుతుంది. హైదరాబాద్-గ్వాలియర్ మధ్య వారానికి మూడు సర్వీసులుండనున్నాయి. ఇవి మధ్యాహ్నం 2:30 గంటలకు మొదలై సాయంత్రం 4:20 గంటలకు చేరుతాయి. జీఎమ్మార్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ సీఈవో ప్రదీప్ పణికర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్త మార్గాల్లో విమాన సర్వీసులను ప్రవేశపెట్టడం ఎంతో సంతోషకరమన్నారు. ప్రయాణికుల కోసం టెర్మినల్ విస్తరణ, అదనపు సౌకర్యాలను చేపట్టామన్నారు. కాగా, ఈ కొత్త సర్వీసులతో హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి దేశంలోని 19 ప్రాంతాలకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమాన సర్వీసులు నడుస్తున్నట్టు అవుతున్నదని చెప్పారు.